


# రాబడి

# మదుపుతోనే గెలుపు









## ద్రవ్యసమీక్షపైనే..

**మార్కెట్ పల్స్**

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

*గమనిక..*

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*



**నేడు** మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

### డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్టైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

### మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ ఆదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

### రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

### ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

## కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

**రోజులు** మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

**ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు**

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

**క్రిప్టో సిప్స్**

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికీ ఇవి దోహదం చేయగలవు.

**గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్**

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.





విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు

## విద్యతోనే వ్యక్తిత్వ వికాసం

వేములవాడ, జూన్ 1: విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని గౌడ సంఘంలో అఫీషియల్స్, ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గోప రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్, జిల్లా అధ్యక్షులు కంచర్ల అమరేందర్‌గౌడ్, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌గౌడ్, ఎస్ఐ రామచంద్రంగౌడ్, బత్తిని సత్యనారాయణ గౌడ్, చక్రవర్తిగౌడ్, వీరయ్యగౌడ్, వికృర్తి లక్ష్మీనారాయణ, సంపత్‌గౌడ్, మల్లికార్జున్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సీనియర్ పీడీ కడారి రవి మృతి

- విషాదంలో ఉమ్మడి జిల్లా క్రీడారంగం

కొత్తపల్లి, జూన్ 1: కరీంనగర్‌కు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్, జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కడారి రవి (57) కొమురవెల్లి సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించాడు. ఉమ్మడి జిల్లా క్రీడారంగంలో సౌమ్యుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరచుకున్న రవి, రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తీవ్ర విషాదం నెలకొంది. హైదరాబాద్‌లో వ్యాయామ వృత్తి విద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో పాటు జింఖాన గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు హాజరయ్యేందుకు తోటి మిత్రుడితో కలిసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలి పోవడంతో అదుపుతప్పి పక్కనే డివైడర్‌కు బలంగా ఢీకొనడంతో డ్రైవింగ్ చేస్తున్న రవికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేట దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రవికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య గృహిణి కాగా, కుమారుడు మైకేల్ హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఉమ్మడి జిల్లా అథ్లెటిక్ క్రీడాకారుడిగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు కైవసం చేసుకొని రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఇనుమడింపజేశారు. ఎందరినో వ్యాయామ విద్య ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ వ్యాయామ విద్య ఉపాధ్యాయుడిగా 2002 మే 31న శనిగరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉద్యోగంలో చేరిన రవి, అక్కడి నుంచి దాచారానికి బదిలీ అయ్యారు. అనంతరం 2013లో ఫిజికల్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొంది జమ్మికుంట పాఠశాలలో చేరారు. అక్కడి నుంచి జంగపల్లికి, తదనంతరం 317 జీవో ప్రకారం పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్ (బాలుర)కు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా అథ్లెటిక్ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, వ్యాయామ విద్య ఉపాధ్యాయ రిసోర్స్ పర్సన్‌గా కొనసాగుతున్న రవి, గతంలో ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శిగా, పెటా సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర బాధ్యుడిగా వివిధ హోదాల్లో పని చేసి అరుదైన ఘనతను దక్కించుకున్నారు. రవి మృతికి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీవైఎస్‌వోలు శ్రీనివాస్‌గౌడ్, సురేశ్, రాందాస్, రవి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీం, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పీఈటీల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు అంతటి శంకరయ్య, శ్రీనివాస్, బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్, పలు క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు సంతాపం తెలిపారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

కరీంనగర్ రూరల్, జూన్ 1: మండలంలోని చేగుర్తి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్ మండలం చేగుర్తి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# ఉల్లాసంగా..ఉత్సాహంగా..

- కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



వాలీబాల్‌లో శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రుద్రంగి, జూన్ 1: సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు సెల్‌ఫోన్లకు పరిమితమవుతున్నారు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులకు క్రీడలపై మక్కువ తగ్గిపోతుంది. వేసవి సెలవుల్లో చిన్నారులకు క్రీడలపై ఆసక్తి చూపించేలా వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. అందులో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు దేవయ్య ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతున్నది. ఉదయం 6నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు చిన్నారులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. మధ్యాహ్నం వేళలో చెస్, పెయింటింగ్, క్యారమ్‌లో శిక్షణ ఇస్తున్నారు. మండల కేంద్రంతోపాటు లింగంపేట, తాండ్రియాల్, కలిగోట గ్రామాల నుంచి కూడా విద్యార్థులు శిబిరాలకు హాజరై శిక్షణ తీసుకుంటున్నారు. శిబిరంలో 14ఏండ్ల లోపు దాదాపు 130 మంది చిన్నారులు వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. కాగా, శిబిరంలో చిన్నారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఉదయం, సాయంత్రం పండ్లు, రాగి జావ, అరటిపండ్లు, కోడిగుడ్లు అందిస్తున్నారు.

### లింగంపేట నుంచి వస్తున్నా..



మాది చందుర్తి మండలం లింగంపేట. నేను ప్రతిరోజూ రుద్రంగిలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరానికి వస్తున్నా. నాకు వాలీబాల్ ఆడడమంటే చాలా ఇష్టం. అందుకే మా అమ్మనాన్నలను ఒప్పించి ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నా. వ్యాయామ ఉపాధ్యాయుడు దేవయ్య వద్ద మెలకువలు నేర్చుకుంటున్న. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా.

*- విద్యార్థి వరుణ్, లింగంపేట (చందుర్తి మండలం)*

### శిబిరం ఉపయోగకరం



గ్రామంలో నిర్వహించే శిబిరంలో కొన్నేళ్లుగా వాలీబాల్ ఆడడం నేర్చుకున్నా. నేను వేములవాడలోని మైనార్టీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న. పాఠశాల నుంచి ఎస్జీఎఫ్, ఐఎస్ఎల్, సొసైటీ వంటి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. మా గ్రామంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం నాకు ఎంతగానో ఉపయోగపడుతున్నది.

*- దయ్యాల నివేద్, విద్యార్థి (రుద్రంగి)*

### ఉత్సాహంగా పాల్గొంటున్నరు..



వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రీడలతో విద్యార్థులకు శారీరకంగా, మానసికోల్లాసం కలుగుతుంది. ఏటా ఈ శిక్షణ శిబిరం కొనసాగుతున్నది. ఇప్పటి వరకు రుద్రంగిలో చాలా మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. మరింత మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం. తల్లిదండ్రులు చిన్నారులను శిబిరాలకు పంపించాలి.

*- దేవయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు*



శిబిరంలో భాగంగా వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

## రెండో వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 1: ప్రభుత్వ జూనియర్ కళాశాలల నూతన అధ్యాపకులకు 2వ వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరుతూ డీఐఈవో గంగాధర్‌కు ఆదివారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ బాధ్యులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను జీవో 16 ప్రకారం క్రమబద్ధీకరించారని, 2023 మే 3న సుమారు 3200 మంది రెగ్యులర్ లెక్చరర్స్‌గా విధులు నిర్వహిస్తు మొదటి వార్షిక ఇంక్రిమెంట్ తీసుకున్నారని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ 24, 26, 31, ఏపీ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996 రూల్ నెం 18 ప్రకారం 2 సంవత్సరాలు ఎలాంటి డిసిప్లినరీ కేసులు లేకుండా, ప్రొబేషన్ పీరియడ్ కంప్లీట్ చేసిన వారికి రెండో వార్షిక ఇంక్రిమెంట్ జారీ చేయాలని తెలుపుతున్నాయని పేర్కొన్నారు.

## ఆధునిక సాగు పద్ధతులతో అధిక లాభాలు

పెద్దపల్లి రూరల్, జూన్ 1: రైతులు వ్యవసాయ సాగు విదానాల్లో ఆధునిక సాగుపద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులతో కూడిన లాభాలుంటాయని రామగిరి కేవీకే, హైదరాబాద్(ఐసిఏఆర్) శాస్త్రవేత్తలు అన్నారు. పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు, కనగర్తి గ్రామాల్లో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ముందస్తుగా వానకాలం సీజన్ పం టల సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధంగా ఉండాలని అన్నారు. పంటల సాగుకు పంటచేలను దుక్కి చేసుకుని సరైన వంగడాలను ఎంపిక చుసుకోవాలన్నారు. విత్తనాలకు అధీకృత డీలర్‌ల వద్దనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదులను తీసుకోవాలని సూచించారు. రశీదులను పంట లు చేతికందేవరకు భద్రపరుచుకోవాలన్నారు. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడడంద్వారా నేల సారాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, రామగిరి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ కిరణ్, నరేశ్, తదితరులు, రైతులు పాల్గొన్నారు.



కళాకారులకు డప్పులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్

## కళాకారులకు డప్పులు అందజేత

ఇల్లంతకుంట, జూన్ 1: పొత్తూరులో సిద్ధం కొండయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ఆదివారం కళాకారులకు డప్పులు అందజేశారు. ఈ సందర్భంగా వారికి కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు.


## మారుతి సేవలు అభినందనీయం



ఎస్ఐ మారుతిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వేములవాడ రూరల్, జూన్ 1: ఎస్ఐగా మారుతి అందించిన సేవలు అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడా రు. వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో జరుగగా, పలువురు ఆయనను సన్మానించారు. ఇక్కడ వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న పురోహితుడు

గంభీరావుపేట, జూన్ 1: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఆదివారం పురోహితుడు రాచర్ల పార్థసారథిశర్మ ఆయన నివాసంలో సన్మానించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు వార్డులను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు.

## ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసాలు

రుద్రంగి, జూన్ 1: మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మూఢనమ్మకాలపై సాధనాశూరులు నిర్వహించిన విన్యాసాలు అలరించాయి. మంత్రాలు తంత్రాలులేవని, మూఢనమ్మకాలను నమ్మవద్దని పద్మశాలీ సంఘం సభ్యులు, సాధనాశూరులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం

బోయినపల్లి రూరల్, జూన్ 1: ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని బూరుగుపల్లి రమేశ్‌చారి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా తడగొండలోని తన ఇంటి ఆవరణలో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఇక్కడ కుటుంబ సభ్యులు బూరుగుపల్లి రాజ్యలక్ష్మి, బన్నీ, రక్షిత, రంగు అవినాష్, హరిత సేన సభ్యుడు కమల్‌గౌడ్, తదితరులు ఉన్నారు.